

ఓపెన్ జిమ్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

ఓపెన్ జిమ్ ఏర్పాటు చేసుకోవడం సంతోషకరం

- **జీహెచ్ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి**

మన్సూరాబాద్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని పెద్దచెరువు అభివృద్ధిలో భాగంగా చెరువు ప్రాంగణంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేసుకోవడం సంతోషంగా ఉందని స్థానిక కార్పొరేటర్, జీహెచ్ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి పేర్కొన్నారు. చెరువు ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను సోమవారం పెద్ద చెరువు వాకర్స్ అసోసియేషన్ సభ్యులతో కలిసి నర్సింహారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశల వారీగా మన్సూరాబాద్ పెద్దచెరువును అభివృద్ధి పరుస్తూ వస్తున్నామని, ఇటీవలే వాకింగ్ ట్రాక్, యోగా షెడ్డును ఏర్పాటు చేశామన్నారు. పరిసర ప్రాంత ప్రజలంతా వాకింగ్ ట్రాక్, యోగాతో పాటు ఓపెన్ జిమ్‌ను సద్వినియోగం చేసుకుంటూ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వేమన్‌రెడ్డి, సభ్యులు, మధురానగర్‌కాలనీ అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, కాస్మోపాలిటన్ కాలనీ అధ్యక్షుడు రుద్ర లక్ష్మీనర్సింహ, శ్రీసరస్వతీనగర్ అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి, శ్రీరామహిల్స్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, వివిధ కాలనీల సభ్యులు పాల్గొన్నారు.

భారతీయ సంస్కృతి గొప్పది : శ్రీనివాస్‌గుప్తా

మన్సూరాబాద్, జనవరి 13(ఆంధ్రజ్యోతి) : ఇతర దేశాలతో పోలిస్తే భారతీయ సంస్కృతి చాలా గొప్పదని, ఇందుకు నిదర్శనంగా మన తెలుగు పండుగలే నిలుస్తాయని టీపీసీసీ ప్రచార కమిటీ కోకన్వీనర్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా పేర్కొన్నారు. నాగోల్ అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో నాగోల్ గ్రామంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉప్పల శ్రీనివాస్‌గుప్తాతో పాటు నాగోల్ ఇన్‌స్పెక్టర్ ఎ.సూర్యనాయక్ కూడా విచ్చేశారు. ఈ పోటీల్లో మహిళలు పోటాపోటీగా ముగ్గులు వేయగా విజేతలకు వారు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నాగోల్ గ్రామ మాజీ సర్పంచ్ గోల్కొండ మైసయ్య, వెంకటేశ్, డప్పు రాజు, అంబేడ్కర్ సంఘం నాగోల్ అధ్యక్షుడు డప్పు వినోద్, నర్సింగ్ పాల్గొన్నారు.

క్రిస్టల్ విల్లాస్‌లో ముగ్గుల పోటీలు

వనస్థలిపురం, జనవరి 13(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు సంక్రాంతి ముగ్గుల పోటీలు నిలువుటద్దం అని క్రిస్టల్ విల్లాస్ అసోసియేషన్ అధ్యక్షుడు పీ.వీ.వీ సత్యనారాయణ అన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ క్రిస్టల్ విల్లాస్‌లో ముగ్గుల పోటీలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు వేసిన రంగవల్లులు విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం పోటీల్లో గెలుపొందిన వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.అశోక్, ఉపాధ్యక్షులు టి.రామ్మోహన్, సాగర్‌కలాల్, షేక్ జావేద్‌బాబు, వీరస్వామి పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ

చాదర్‌ఘాట్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): శాలివాహన వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించే సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా ఆదివారం అర్ధరాత్రి, సోమవారం ఉదయం వంద మంది నిరుపేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు రామాచారి, కార్యదర్శి కమలాకర్, కోశాధికారి యాదయ్యలతో కూడిన బృందం నాంపల్లి రైల్వేస్టేషన్, సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, కాచిగూడ రైల్వేస్టేషన్, ఆర్టీసీ మహాత్మాగాంధీ బస్‌స్టేషన్, దిల్‌సుఖ్‌నగర్ బస్‌స్టేషన్లలో ఫుట్‌పాత్‌లపై చలికి వణుకుతూ నిద్రిస్తున్న నిరుపేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు.



సుధీర్‌రెడ్డి ఇంట్లో భోగి వేడుకల్లో కేటీఆర్, హరీష్‌రావు, దయాకర్‌రావు



సరూర్‌నగర్ హుడా కాంప్లెక్స్‌లో భోగి మంటలు వేసిన స్థానికులు



హస్తినాపురం డివిజన్ జడ్జీస్‌రోడ్‌లో భోగి మంటలు

ఘనంగా భోగి వేడుకలు

- **సుధీర్‌రెడ్డి ఇంట వేడుకల్లో మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్‌రావు, సబితారెడ్డి**

ఎల్‌బీనగర్, జనవరి 13(ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి వేడుకలు సోమవారం భోగి మంటలతో ప్రారంభమయ్యాయి. ప్రజలు తెల్లవారుజామునే భోగి మంటలు వేసుకున్నారు. అనంతరం పతంగులను ఎగురవేస్తూ సంబరాలు జరుపుకున్నారు. ప్రజలు ఎక్కువ శాతం తమ సొంత ఊళ్లకు తరలివెళ్లగా సంక్రాంతి సంబరాలను జరుపుకునేందుకు మరి కొందరు ఆంధ్రకు వెళ్లారు. ఇక్కడ ఉన్నవారు భోగి మంటల తర్వాత ఆలయాలకు వెళ్లడంతో పాటు ఇళ్ల వద్ద సంబరాలు జరుపుకున్నారు.



సైదాబాద్ ఎస్‌బీహెచ్ ఏ కాలనీలో భోగిమంటలు

సుధీర్‌రెడ్డి ఇంట వేడుకల్లో మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు

నానక్‌రాంగూడలోని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఇంట జరిగిన భోగి వేడుకల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీష్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావుతో పాటు ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేష్, ముఠా గోపాల్, పాడి కౌశిక్‌రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్, యువజన నాయకుడు కార్తీక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. వారికి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, కమల దంపతులు కుటుంబ సభ్యులతో స్వాగతం పలికి భోగి వేడుకల్లో పాల్గొన్నారు. తెల్లవారుజామున భోగి మంటలను వేసిన వారు.. పార్టీ నేతలు, కుటుంబ సభ్యులతో కలిసి సంబరాలు నిర్వహించారు.

చంపాపేట, హస్తినాపురంలలో..

చంపాపేట : చంపాపేట, హస్తినాపురం డివిజన్లలో ప్రజలు సోమవారం సంక్రాంతిలో భాగంగా భోగి పండుగ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ప్రజలు ఉదయం నుంచే భోగి మంటలను వేసుకొని సంబరాలు జరుపుకున్నారు. మహిళలు ఇళ్ల ముందు అందమైన రంగవల్లులను వేసుకున్నారు.

మీర్‌పేట్, బడంగ్‌పేట్‌లలో..

సరూర్‌నగర్ : సంక్రాంతికి స్వాగతం పలికే భోగి పండుగను సోమవారం మీర్‌పేట్, బడంగ్‌పేట్ కార్పొరేషన్ల పరిధిలోని ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఏపీకి చెందిన వారు తమ సొంత ప్రాంతాలకు వెళ్లిపోగా ఇక్కడి కాలనీల్లో మిగిలి ఉన్న స్థానికులు ఉత్సాహంగా భోగి పండుగ నిర్వహించుకున్నారు. తెల్లవారు జామునే ఇళ్ల ముందు భోగి మంటలు వేసి పాలు పొంగించారు. ఇళ్లలోని చిన్నారులకు భోగి పళ్లు పోశారు. వాకిళ్లలో అందమైన రంగవళ్లులు వేసి తీర్చిదిద్దారు. నైవేద్యం తయారు చేసి తమ ఇష్ట దైవాలకు సమర్పించుకున్నారు. యువకులు పతంగులు ఎగురవేస్తూ సందడిగా గడిపారు.



మీర్‌పేట్ తిరుమలాహిల్స్ కాలనీలో భోగి మంటల వద్ద టీడీపీ నాయకుడు సుందరరామయ్య తదితరులు

బడంగ్‌పేట్, మీర్‌పేట్ బీజేపీ అధ్యక్షుల నియామకం

- **ఒక్కో కార్పొరేషన్‌కు ఇద్దరు చొప్పున అధ్యక్షులు**
- **పరిధి విస్తరించడంతో పెరిగిన పదవులు**

సరూర్‌నగర్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్, మీర్‌పేట్ కార్పొరేషన్లకు బీజేపీ అధ్యక్షులను నియమించారు. ఆయా కార్పొరేషన్ల పరిధి విస్తరించడంతో గతానికి భిన్నంగా ఇద్దరేసి అధ్యక్షులను ఎంపిక చేశారు. బడంగ్‌పేట్, మీర్‌పేట్ కార్పొరేషన్లను రెండేసి భాగాలుగా విభజించి వేర్వేరుగా అధ్యక్షులను నియమించారు. ఇప్పటి దాకా బడంగ్‌పేట్ కార్పొరేషన్ అధ్యక్షుడిగా నాదర్‌గుల్‌కు చెందిన చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి(ఓసీ), మీర్‌పేట్ కార్పొరేషన్ అధ్యక్షుడిగా మీర్‌పేట్‌కు చెందిన పెండ్యాల నర్సింహ(బీసీ) వ్యవహరించారు.



రామకృష్ణారెడ్డి, బడంగ్‌పేట్-1 అధ్యక్షుడు



వీరకర్ణారెడ్డి, బడంగ్‌పేట్-2 అధ్యక్షుడు

కొత్త అధ్యక్షులు వీరే..

రెండుగా విభజించిన బడంగ్‌పేట్, మీర్‌పేట్ కార్పొరేషన్లకు నూతన అధ్యక్షులను పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి ఆదివారం ప్రకటించారు. బడంగ్‌పేట్-1 అధ్యక్షుడిగా బడంగ్‌పేట్‌కు చెందిన రాళ్లగూడెం రామకృష్ణారెడ్డి(ఓసీ), బడంగ్‌పేట్-2 అధ్యక్షుడిగా అల్మాస్‌గూడకు చెందిన రామిడి వీరకర్ణారెడ్డి(ఓసీ) నియమితులయ్యారు. ఇక మీర్‌పేట్-1 అధ్యక్షుడిగా మీర్‌పేట్‌కు చెందిన పసునూరి భిక్షపతి చారి(బీసీ), మీర్‌పేట్-2 అధ్యక్షుడిగా జిల్లెలగూడకు చెందిన తులసి ముఖేశ్‌ముదిరాజ(బీసీ) నియమితులయ్యారు. బడంగ్‌పేట్ ఇద్దరు అధ్యక్షులు ఓసీ సామాజిక వర్గానికి చెందిన వారు కాగా, మీర్‌పేట్ ఇద్దరు అధ్యక్షులు బీసీ సామాజిక వర్గానికి చెందిన వారు కావడం ఇక్కడ గమనార్హం!

బడంగ్‌పేట్ అధ్యక్షులకు సన్మానం

బడంగ్‌పేట్-1,2 అధ్యక్షులుగా నియమితులైన రామకృష్ణారెడ్డి, వీరకర్ణారెడ్డితో పాటు జిల్లా కౌన్సిల్ సభ్యులుగా నియమితులైన బాలాపూర్‌కు చెందిన జోరల ప్రభాకర్, అల్మాస్‌గూడ వినాయకహిల్స్‌కు చెందిన జి.శివారెడ్డిని సోమవారం నాదర్‌గుల్‌లోని పార్టీ కార్యాలయంలో తాజా మాజీ అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.



భిక్షపతిచారి, మీర్‌పేట్-1 అధ్యక్షుడు



ముఖేశ్‌ముదిరాజ్, మీర్‌పేట్-2 అధ్యక్షుడు

మీర్‌పేట్ అధ్యక్షులకు సన్మానం

మీర్‌పేట్-1,2 అధ్యక్షులుగా నియమితులైన భిక్షపతిచారి, ముఖేశ్‌ముదిరాజ్‌లను ఎస్ఎల్ఎన్ఎస్ కాలనీలోని కార్పొరేటర్ యెడ్ల మల్లేశ్‌ముదిరాజ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకుడు కొలన్ శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొని ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు.

బీజేపీ కుర్మగూడ అధ్యక్షుడిగా దుద్యాల యుగేంద్రనాథ్

సైదాబాద్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): యాకుత్‌పురా నియోజకవర్గం బీజేపీ కుర్మగూడ డివిజన్ అధ్యక్షుడిగా దుద్యాల యుగేంద్రనాథ్ నియమితులయ్యారు. ఈ మేరకు భాగ్యనగర్ జిల్లా పార్టీ ఎన్నికల అధికారి బంగారు శృతి నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యుగేంద్రనాథ్ మాట్లాడుతూ డివిజన్‌లో పార్టీ పటిష్టతకు పాటుపడుతానని అన్నారు. రాబోయే గ్రేటర్ ఎన్నికల్లో కుర్మగూడ డివిజన్‌ను బీజేపీ కైవసం చేసుకునేందుకు కృషి చేస్తానని తెలిపారు. తనపై నమ్మకంతో అధ్యక్ష పదవి అప్పగించిన జాతీయ కౌన్సిల్ సభ్యుడు సహదేవ్‌యాదవ్, అసెంబ్లీ కన్వీనర్ బండ వెంకట్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.



యుగేంద్రనాథ్



కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలో గోదా రంగనాథస్వామి కల్యాణం



మూసారాంబాగ్‌లోని ఆండాళ్ నిలయంలో గోదారంగనాథస్వామి కల్యాణం

కమనీయం.. గోదా రంగనాథుల కల్యాణం

కొత్తపేట, జనవరి 13(ఆంధ్రజ్యోతి): కొత్తపేట ఆలయాల్లో సోమవారం గోదా రంగనాథ స్వామి కల్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్నేహపురి గోదా సమేత పద్మావతీ వేంకటేశ్వరస్వామి ఆలయం శ్రీనివాస మండపంలో వేదమంత్రోచ్చరణల మధ్య, సంప్రదాయబద్ధంగా గోదా రంగనాథుల కల్యాణ ఘట్టాలు కమనీయంగా సాగాయి. తొలుత ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా పాశురాలపైన 30వ పాశురం విశేషాలను వివరించారు. కొత్తపేట డివిజన్ పరిధిలోని ఎస్ఆర్ఎల్‌కాలనీ, సత్యానగర్, ఎస్‌బీహెచ్‌కాలనీల్లో గోదా రంగనాథస్వామి వార్ల కల్యాణం ఘనంగా నిర్వహించారు.

అబ్దుల్లాపూర్‌మెట్ : మండలంలోని అనాజ్‌పూర్ గ్రామంలోని రామాలయంలో సోమవారం గోదా రంగనాథస్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు కల్యాణంలో పాల్గొని అమ్మవారికి తలంబ్రాలు పోశారు. స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గ్రామప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

చంపాపేట : చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలో సోమవారం గోదా రంగనాథుల కల్యాణం కనులపండువగా జరిగింది. కోదండ రామాలయంలో ధనుర్మాసోత్సవాల ముగింపు రోజును పురస్కరించుకొని ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా కల్యాణ మండపం వరకు చేర్చారు. వేద పండితులు, అర్చకులు గోదా రంగనాథుల కల్యాణాన్ని భక్తుల సమక్షంలో ఘనంగా జరిపారు. అర్చకులు భక్తుల గోత్రనామాలను చదివి స్వామి వారి కల్యాణ విశిష్టతను వివరించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి దంపతులు, మాజీ ధర్మకర్తలు దుర్గారెడ్డి, బీసుకుంట్ల సతీష్ గౌడ్, మధుసాగర్, యాదిరెడ్డి, భారీ ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

వనస్థలిపురం : వనస్థలిపురంలోని ప్రసిద్ధ లక్ష్మీగణపతి ఆలయంలో గోదారంగ స్వామి తిరు కల్యాణ మహోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఆలయ కమిటీ ప్రతినిధులు స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బుద్దోలు అశోక్‌కుమార్‌గౌడ్, ఆలయ కమిటీ వైస్ చైర్మన్లు మిట్టా రామ్మోహన్, కంచి కృష్ణమోహన్, కార్యదర్శి ప్రభాకర్, లక్ష్మారావు, బాలేశ్వర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



శాలివాహననగర్‌కాలనీలో గోదా రంగనాథస్వామి ఉత్సవ మూర్తుల ఊరేగింపులో మహిళలు, ప్రధాన అర్చకుడు కాటూరి శ్రీనుస్వామి

బీసీలకు పదోన్నతుల్లో రిజర్వేషన్ల కోసం.. రాజ్యాంగ సవరణ చేయాలి : ఆర్.కృష్ణయ్య

బర్కత్‌పుర, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్ల కోసం రాజ్యాంగ సవరణ చేయాలని రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. పదోన్నతుల్లో రిజర్వేషన్లను పొందుతున్న ఏ వర్గానికి విధించని క్రీమి లేయర్‌ను బీసీలకే విధించడం ఏమిటని.. దీన్ని తక్షణమే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కాచిగూడ అభినందన గ్రాండ్ హోటల్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, బీసీ లెక్చరర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాముని సుదర్శన్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన రాష్ట్ర సదస్సులో ఆర్. కృష్ణయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాజ్యాంగాన్ని సవరించి బీసీలకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బలమైన బీసీ ఉద్యమం చేపడితే కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి పలు పథకాలను ప్రవేశపెడుతుందని సూచించారు. రిజర్వేషన్లు పెట్టింది పేదరిక నిర్మూలన కోసం కాదని సామాజిక అభివృద్ధి కోసమేనని ఆయన స్పష్టం చేశారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో బీసీ సంఘాల నేతలు, బీసీ లెక్చరర్స్ అసోసియేషన్ నేతలు తదితరులు పాల్గొన్నారు.



బీసీ లెక్చరర్ల రాష్ట్ర సదస్సులో ప్రసంగిస్తున్న రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య